క్లుప్తంగా

శ్రీ మఠంలో ద్వాదశి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయంరూరల్ /మంత్రాలయం : శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో గురువారం ద్వాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనంకు వేకువజాముునుంచి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు రథోత్సవాలపై ఊరేగించారు.

22న రుక్మిణీ పాండురంగస్వామి శత జయంత్యుత్సవం



ప్రత్యేక అలంకరణలో రుక్మిణి,పాండురంగస్వామి

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఫారెస్ట్ లైన్ అంబాభవానీ దేవాలయంలో వెలిసిన రుక్మిణీ పాండురంగస్వామి శత జయంతి ఉత్సవాలను ఈనెల 22వ తేదీన నిర్వహిస్తామని ఆలయ అర్చకులు గోవింద్ గురువారం తెలిపారు. 20వ తేదీన గంగపూజ, ధ్వజారోహణ, గోమాత పూజ, నవగ్రహ పూజ, 21న తులసీ అర్చన, పంచామృతాభిషేకం, 22న ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజున 6 గంటల వరకు భజనలు ఉంటాయన్నారు. 22న పురవీధులగుండా భజనలు చేస్తూ పల్లకీ సేవ ఉంటుందని చెప్పారు. రుక్మిణీ పాండురంగస్వామి వార్ల విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి చేయాలి

ఆదోని రూరల్ : వలంటీర్లు ప్రభుత్వ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎంపీడీఓ గీతావాణి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క వలంటీర్ తమకు కేటాయించిన 50 ఇళ్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేసి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతిరోజూ తప్పనిసరిగా సచివాలయంలో హాజరు వేయాలన్నారు.ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటలకు స్పందన కార్యక్ర మం నిర్వహించాలని, అందులో వలంటీర్లు పాల్గొని తమకు ఫొటోలు పంపించాలని చెప్పా రు. ఈఓపీఆర్‌డీ జనార్దన్, ఏఓ శేఖర్, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన

కోసిగి: మండల కేంద్రం సమీపంలో పులికనుమ పైపులైన్ నుంచి కొత్తగా కోసిగి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించనున్నారు. పథకం నిర్మాణానికి ఇటీవల టెండర్లు పూర్తి చేశారు. రూ.4.80 కోట్లతో నిర్మించబోతున్న పథకం కోసం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి భూమి పూజ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, మాజీ డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి భూమి పూజకు స్థలాన్ని పరిశీలించారు. ఇరిగేషన్ డీఈ విజయరాజు, నాయకులు బుల్లి నరసింహులు, మాజీ మండల ఉపాధ్యక్షుడు హాజీ ఉస్మాన్, సోఫిరజాక్, రాముడు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో యువత పాత్ర కీలకం

ఆదోని అర్బన్ : అవినీతి నిర్మూలనలో యువత కీలక పాత్ర పోషించాలని నేషనల్ యాంటీ కరప్షన్ అండ్ ఆపరేషన్ సౌత్ ఇండియా కో ఆర్డినేటర్ శ్రీమతి ఆర్ఎం షేక్ కోరారు. గురువారం పట్టణంలోని కార్యాలయంలో సబ్‌కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి సన్మానించారు. అలాగే.. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, రెండో పట్టణ సీఐ శ్రీనివాసనాయక్, ఎంసీహెచ్ ఇన్‌చార్జ్ మాధవీలత, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ లింగన్నను సన్మానించారు. మహారాష్ట్ర ఇన్‌చార్జ్ మహబూబ్‌బాషా, ఏపీ ఇన్‌చార్జ్ మాదుగుండు ఈరన్న, ఏపీ వైస్ చైర్మన్ బి.మంజునాథ్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పొలిటిక్స్ ప్రో గద్వాల తాహెర్ ఉసేన్, కర్నూలు జిల్లా ప్రెసిడెంట్ చాయా వీరేష్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- కోసిగిలో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళలకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం/కోసిగి : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కోసిగి సచివాలయం-3 పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ మురళీమోహన్‌రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి పథకాల గురించి వివరించారు. అలాగే సమస్యలుంటే తన దృష్టి తేవాలని సూచించారు. ఒక వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, జగనన్న అమలు చేస్తున్న పలు పథకాలు, కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పాలన సాగించడం నిజంగా మెచ్చుకోదగ్గ విషయమని కొనియాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం పచ్చచొక్కాలకే సంక్షేమ ఫలాలు అందేలా చేశారని ఆరోపించారు. ముఖ్యంగా జన్మభూమి కమిటీ పేరుతో పారదర్శక రహిత పాలన సాగించారని దుయ్యబట్టారు. నేడు ఏ ఒక్కరీ ప్రమేయం లేకుండా పైసా అవినీతి లేకుండా సంక్షేమం ప్రతి ఇంటికీ నడిచొస్తోందని వివరించారు. ఇక కోసిగి ప్రజల కోసం కొత్తగా రూ.4.80 కోట్లతో ఎత్తిపోతల పథకం, రూ.36 లక్షలతో ఎస్ఎస్ ట్యాంకు, ఫిల్టర్‌బెడ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే కోసిగి ప్రజల దాహార్తికి ఉపశమనం లభించనుందని పేర్కొన్నారు. గ్రామంలో ప్రాధాన్యతను బట్టి నీటి ఎద్దడి నివారణ, సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఏపీటీఎఫ్ నాయకులు టీచర్ రాజమౌళి స్వగృహంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఇరిగేషన్ అధికారులు కోసిగి ఎత్తిపోతల పథకం నిర్మాణంపై సమావేశమయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టనగౌడ్, ఎంపీపీ ఈరన్న, శ్రీనివాస రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు నాడుగేని నరసింహులు, మహంతేష్ స్వామి, మాణిక్యరాజు, నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, సర్పంచ్ అయ్యమ్మ, మాజీ మండల ఉపాధ్యక్షుడు హాజి ఉస్మాన్, మహిళా నాయకురాలు మంగమ్మ, భీమక్క, ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ రుద్రగౌడ, పీఆర్ ఏఈ యుగంధర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ షేక్షావలి, ఏపీఎం సత్యమ్మ, ఏపీఓ జయరాం పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కౌతాళం: బదినేహాల్ గ్రామానికి చెందిన రామయ్యకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.48 వేల చెక్కును ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి గురువారం అందజేశారు. మంత్రాలయం మండల కన్వీనర్ భీమిరెడ్డి ఉన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి

కోసిగి: మండలంలోని క్రీడకారులను ప్రోత్సహించేందుకు ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని షటిల్ క్రీడకారుడు పీడీ రాజారామ్, ఉపాధ్యాయుడు రాముడు, గట్టు వెంకటేష్, మల్లికార్జున కోరారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

బాధ్యతగా నిబంధనలు పాటించాలి



రోడ్ సేఫ్టీ కరపత్రాలను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్, ఆర్టీఓ అధికారులు

ఆదోని అర్బన్ : వాహనదారులు బాధ్యతగా నిబంధనలు పాటించి ప్రయాణికులను గమ్యం చేర్చాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, ఆర్టీఓ శివారెడ్డి పాల్గొని రోడ్ సేఫ్టీ కరపత్రాలను విడుదల చేశారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ బడిబస్సులను నడిపి డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆర్టీఓ మాట్లాడుతూ చాలా ఎక్కువశాతం బైకుల ద్వారానే ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోరారు. ఆటో నడిపేవారు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఈ ఏడాది ప్రమాదాలు, మరణాల శాతం తగ్గిందని వివరించారు. ఇందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రమాదాలు చోటు చేసుకునే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాద నివారణకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, అసిస్టెంట్ ఎంవీఐ సుధాకర్‌రెడ్డి, వైద్యుడు శ్రీపతి,డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీపతి డ్రైవర్‌లకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఆర్టీఓ అధికారులు అద్దాలు అందజేశారు.

పార్టీలకు అతీతంగా పథకాల అందజేత



మహిళలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని అర్బన్: పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి అయిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 3వ వార్డులో జలగారి వీధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భం గా ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులను పిలిపించి చర్చించారు. అలాగే మూడున్నరేళ్లలో అందిన సంక్షేమ పథకాలు, చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్ అందజేశారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.ముందుగా మూడో వార్డులో ఆయనకు స్థానికులు పూల వర్షంతో స్వాగతం పలికారు. కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయి నేజీ సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్‌చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదే శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఇంటికి నవరత్నాలు అందేలా చూస్తూ నిరుపేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. కా ర్యక్రమంలో నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంతి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుసూదన్, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, ఆయా కార్పొరేషన్‌ల డైరెక్టర్లు రేణుక, మంజుల, మురళీరెడ్డి, కామా క్షి తిమ్మప్ప, సలీం, మస్తాన్, కౌన్సిలర్‌లు, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, నాయకులు కిషోర్, రామలింగేశ్వర యాదవ్, లాల్‌బాషా, సుధాకర్, శ్రీలక్ష్మి, సురేష్, ఇబ్రహీం, దేవదాసు, మహేశ్వరి, తాయన్న, దస్తగిరి, ఈరన్న, బ్యాంకు మల్లి, రహీం పాల్గొన్నారు.

న్యాయం చేయండి సారూ..



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

ఆదోని రూరల్ : ఆదోనిలో బైపాస్ నిర్మాణం కోసం సేకరించిన భూముల వివరాలు తప్పుల తడకగా ఉన్నాయని, ప్రైవేట్ భూములను ప్రభుత్వ భూములుగా అధికారులు చూపించి తమకు అన్యాయం చేశారని, తమకు న్యాయం చేయాలని బాధితులు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలియజేశారు. బాధితులు అబ్దుల్ రషీద్, సయ్యద్ అజ్మర్‌పీర్, ఇక్బాల్, ఈషా, షఫీ, అక్బర్, మజ్హర్ మాట్లాడారు. కల్లుబావి పరిధిలోని సర్వే నంబర్ 414, 411లో గల భూములు గతంలో కర్ణాటకలోని హంపీ విరుపాక్షిస్వామి దేవస్థానానికి చెందినవని అధికారులు బహిరంగ వేలం వేశారన్నారు. అయితే 411 సర్వే నంబర్‌కు టీడీపీ నాయకుడు గతంలో ఎండోమెంట్ అధికారుల నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ పొందాడన్నారు. అయితే సర్వే నంబర్ 414కు మాత్రం అధికారులు నో అబ్జక్షన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని, ఇందులో సుమారు 50 కుటుంబాలు ప్లాట్లను కొనుగోలు చేశారని చెప్పారు. తమ ప్లాట్లను 2008 నుంచి ప్రభుత్వం నిషేధిత జాబితాలో ఉంచిందని వాపోయారు. అనంతరం సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

ఖాదర్‌లింగస్వామికి ప్రత్యేక ఫాతెహాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి సమాధి

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు స్వామి వారికి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి పూజలు చేశారు.

టెంకాయల విక్రయ హక్కుల వేలం

ఆస్పరి: మండలంలోని ములుగుందంలో వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాల్లో టెంకాయలు అమ్మేందుకు ఈనెల 22న దర్గాలో టెంకాయల విక్రయ హక్కుల వేలం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. ఆసక్తి గల వారు అదే రోజు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వివరాలకు సెల్ 97051 07987 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆలూరు: దేవనకొండ మండలం గద్దెరాళ్ల గ్రామంలో కొలువుదీరిన శ్రీ మారెమ్మవ్వ దేవస్థానంలో ఈనెల 23న టెంకాయల విక్రయ హక్కుల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రశేఖర్ రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 23న ఉదయం 10 గంటలకు దేవస్థానం ఆవరణలో వేలం పాట నిర్వహిస్తామన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారయత్నం

ఆదోని రూరల్ : మండలంలోని కపటి గ్రామంలో ఓ మతిస్థిమితం లేని యువతిపై అదే గ్రామానికి చెందిన నాయక్‌రాముడు అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు యువతి అన్న ఇస్వీ పోలీసు స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి



కూలీల సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ జుబేర్

కౌతాళం: కూలీలు వలస వెళ్లకుండా ఉపాధి పనులకు రావాలని ఏపీఓ జుబేర్ కోరారు. గురువారం సాయంత్రం సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పనులు సిద్ధంగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొలతల మేరకు పనులు చేస్తే రోజుకు రూ. 257 వేతనం లభిస్తుందని, ఉన్న గ్రామంలోనే పనులున్నప్పుడు వలస వెళ్లి అవస్థలు పడొద్దని సూచించారు. ఉపసర్పంచ్ తిక్కయ్య, ఈసీ ఖాదర్‌బాషా, ఫీల్డ్ అసిస్టెంట్ లింగన్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ఆదోని అర్బన్ : రోడ్డు ప్రమాదాల నివారణపై ఆదోని టూటౌన్ సీఐ శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పట్టణంలోని క్రాంతినగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటుబెల్టు ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. ముఖ్యంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అలాగే ఎవరైనా అక్రమంగా మద్యం సరఫరా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేసి జైలు తరలిస్తామని హెచ్చరించారు. అక్రమ మద్యం సరఫరాపై తమకు ప్రజలు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

హత్యాయత్నం కేసులో జైలు, జరిమానా

కర్నూలు(లీగల్): కర్నూలు నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడైన పఠాన్ ఇమ్రాన్ ఖాన్‌కు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.15 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి టి.కేశవ్ గురువారం తీర్పు చెప్పారు. 2020 సెప్టెంబర్ 6వ తేదీన మహ్మద్ రఫి అనే వ్యక్తిపై నిందితుడు పఠాన్ ఇమ్రాన్ ఖాన్ దాడి చేసి హత్యాయత్నం చేశాడని ఫిర్యాదు చేయగా పోలీసులు నిందితుడిపై కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్లు వాదించారు. జరిమానాలో రూ.10 వేలు ఫిర్యాదుదారుడు, సహబాధితుడికి చెల్లించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు



చిరుధాన్యాల వంటలపై డెమో ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్త అపర్ణ

ఎమ్మిగనూరురూరల్: చిరుధాన్యాలలో పోషక విలువలు పుష్కలంగా ఉంటాయని కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ, డాక్టర్ అపర్ణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల ఉత్పత్తులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. మహిళలు, పిల్లలు విటమిన్ లోపాల నుంచి బయటపడాలంటే పోషక విలువలుండే ఆహారం తీసుకోవాలన్నారు. రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాలు తయారు చేయడంపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, వీరేష్, కరుణ, అరేకల్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పోలీసుల దురుసు ప్రవర్తన



బైక్‌పై కూర్చున్న వ్యక్తిని తోసేస్తున్న పోలీసులు

ఆదోని అర్బన్ : పట్టణంలోని వన్ టౌన్ సమీపంలో ఈ- చలానా వసూలు చేసే క్రమంలో బైకుపై వెళ్తున్న వ్యక్తి పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. గురువారం ఈ సంఘటన సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. భార్యాభర్త బైకుపై వెళ్తుండగా వారిని అడ్డగించి ఈ-చలానా గురించి అడిగారు. అంతలోనే ఏమి జరిగిందో మరో పోలీసు వచ్చి బైకుపై కూర్చున్న వ్యక్తిని తోశారు. దీంతో ఆ వ్యక్తి కోపోద్రిక్తుడై బైకు దిగి పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. అయితే భార్య వెంటనే భర్తను పక్కకు తీసుకెళ్లింది. అక్కడికీ వదలకుండా ముగ్గురు పోలీసులు ఆ వ్యక్తిని కిందకు పడేసి ఈడ్చుకెళ్లారు. స్థానికులు చూస్తున్నా పోలీసుల ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ-చలానా కోసం పోలీసులు ఇంత దురుసుగా ప్రవర్తించడంపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై వన్ టౌన్ సీఐ విక్రమసింహను వివరణ కోరగా.. ఈ-చలానా కోసం బైకు ఆపడం వాస్తవమేనని చెప్పారు. అయితే సదరు వాహనదారుడు పోలీసుల విధులకు ఆటంకం కలిగించి నా బైకే ఆపుతావా.. నీవెవరు నన్ను ఆపడానికి అని దుర్భాషలాడటంతో పోలీసులు ఆ వ్యక్తిని స్టేషన్‌కు పిలుచుకొచ్చారన్నారు. ఇందులో సిబ్బంది తప్పిదమేమీ లేదని సీఐ తెలిపారు.

రేపు 'దిశ' కమిటీ సమావేశం

- కేంద్ర ప్రభుత్వం నిధుల వినియోగంపై సమీక్ష

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ (దిశ) కమిటీ సమావేశం ఈ నెల 21న జరుగనుంది. ఈ కమిటీకి కర్నూలు ఎంపీ ఎస్.సంజీవ్‌కుమార్ చైర్మన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహిస్తారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ, డీఆర్‌డీఏ-వైకేపీ, వ్యవసాయ శాఖ, హౌసింగ్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అటవీ శాఖ తదితర శాఖలకు కేంద్రం నుంచి వివిధ స్కీమ్‌ల కింద నిధులు విడుదల అవుతున్నాయి. ఈ నిధుల వినియోగంపై దిశ కమిటీ కో-ఆర్డినేషన్ చేయడంతో పాటు పర్యవేక్షిస్తుంది. శనివారం జరిగే దిశ కమిటీ సమావేశానికి నంద్యాల ఎంపీతో కర్నూలు,నంద్యాల జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు కూడ హాజరవుతారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు.

భ్రూణ హత్యలను నివారిద్దాం

- లింగనిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలను ఉపేక్షించొద్దు
- అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎస్పీ వినోద్‌కుమార్

ఆదోని రూరల్ : సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఎస్పీ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సబ్ కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో భ్రూణ హత్యల నివారణ, పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమన్నారు. రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా, పీసీపీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై రూ.50 వేల జరిమానాతో పాటు మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్ట ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారమిచ్చిన వారికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు బహుమతి అందజేస్తామని చెప్పారు. ఆదోని డివిజన్ పరిధిలోని 39 స్కానింగ్ కేంద్రాలను మూడు నెలలకోసారి తనిఖీ చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్‌ల అనుమతులను రద్దు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న, గైనకాలజిస్టు డాక్టర్ మాధవీలత, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీనియర్ సహాయకులు సంగీత, టూ టౌన్ సీఐ శ్రీనివాస నాయక్, జిల్లా మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

హొళగుంద: మార్లమడికి రోడ్డులో గురువారం మొక్కజొన్న సొప్ప ట్రాక్టరు అదుపుతప్పి బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఉన్న కూలీలు, డ్రైవర్ జాగ్రత్త పడడంతో ప్రమాదం తప్పింది. వాహనం బోల్తా పడడంతో ఆ మార్గంలో కొద్దిసేపు పెద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆదోని ప్రాంతానికి చెందిన రైతులు కర్ణాటకలో మొక్కజొన్న చొప్ప కొనుగోలు చేసి హొళగుంద మీదుగా ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నారు. మార్లమడికి దాటి వస్తుండగా రోడ్డు మధ్యలో గుంతలు ఉండడంతో వాటిని తప్పించే క్రమంలో ట్రాక్టరు అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవరుతో పాటు కూలీలు అప్రమత్తమై పక్కకు దూకేయడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానిక రైతులు తాళ్లు కట్టి ట్రాక్టరును సరిచేశారు. మార్లమడికి రోడ్డు గుంతలతో అధ్వానంగా వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ఆలూరు రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆలూరు తహసీల్దార్ మల్లికార్జున అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయ సర్వేయర్లు రీసర్వే చేస్తున్న సమయంలో రైతులు దగ్గరుండి వారి పొలాలకు సంబంధించిన హద్దులను తెలియజేయాలన్నారు. రైతుల సమక్షంలో సరిహద్దుల గుర్తింపు చేపడితే భవిష్యత్తులో భూములకు సంబంధించి రైతుల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తవని చెప్పారు. రీసర్వే పూర్తయితే రైతు సాగు చేసుకుంటున్న భూమి ఆన్‌లైన్ అడంగల్ ఉన్న భూమి విస్తీర్ణంలో వ్యత్యాసాలు ఉండవని తహసీల్దార్ తెలిపారు.

పక్కీరప్ప తాత ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆస్పరి: ఆస్పరిలో గురువారం పక్కీరప్ప తాత ఆలయంలో గురుస్వామి రామాంజనేయులు ఆధ్వర్యంలో పక్కీరప్ప తాతకు ప్రత్యేక అలంకారం, గంగ, ఆకు పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శివదీక్షా పరులు ఓం నమః శివాయ అంటూ భజనలు చేశారు. అనంతరం శివ స్వాములకు ఆస్పరికి చెందిన జమ్మప్ప భిక్ష ఏర్పాటు చేశారు.